

మేడారం జాతరకు 224 బస్సులు



తెలంగాణ కుంభమేళా.. మేడారం సమక్క, సారలమ్మ జాతరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా బస్సులు బయలుదేరి వెళ్లనున్నాయి. ఖమ్మం, వరంగల్ రీజియన్‌లనుంచి ఈ బస్సులను నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి 25 వరకు రీజియన్‌లో ఏడు డిపోల పరిధి నుంచి మొత్తం 224 బస్సులను ఆ రీజియన్‌ల ద్వారా నడపనున్నారు. జాతరకు లక్షలాది మంది భక్తులు వెళ్లనున్న నేపథ్యంలో ఆర్టీసీ అందుకు తగిన ఏర్పాట్లు చేస్తోంది. బస్సులను ప్రణాళికాబద్ధంగా నడపడంకోసం కార్యాచరణ రూపొందించి, అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు.

\- నల్లగొండ

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో జరిగే మేడారం జాతర ఈ నెల 21వ తేదీ నుంచి 24వరకు జరగనుంది. ఈ నేపథ్యంలో జాతరకు బస్సులను ఈ నెల 18నుంచే నడపనున్నారు. రీజియన్‌కు చెందిన బస్సులను వరంగల్ రీజియన్‌కు 130, ఖమ్మం ఆర్టీసీ రీజియన్‌కు 94 బస్సులను కేటాయించారు. ఆ రెండు జిల్లాల నుంచి మేడారం జాతరకు బస్సులను నడిపిస్తారు. ఆయా జిల్లాల నుంచి ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపిస్తారు. రీజియన్‌కు చెందిన బస్సులతోపాటు డ్రైవర్లు, కండక్టర్లను సైతం ఖమ్మం, వరంగల్ రీజియన్‌లకు పంపిస్తున్నారు.

జాతరకు మహిళలకు ఉచిత ప్రయాణమే



రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద డిసెంబరు 9వ తేదీ నుంచి పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. అయితే మేడారం జాతరకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందా? లేదా? అన్న చర్చ సాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఆర్టీసీ సంస్థ మేడారం జాతరకు కూడా ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మేడారానికి పెద్దఎత్తున మహిళలతోపాటు పురుషులు తరలి వెళుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 18 నుంచి ఖమ్మం, వరంగల్ మీదుగా మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు నడవనున్న నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో అందుకనుగుణంగా ఏర్పాట్లను చేస్తున్నారు.

- వరంగల్, ఖమ్మం రీజియన్లకు తరలింపు
- ఈ నెల 18 నుంచి 25 వరకు నడవనున్న బస్సులు
- భక్తుల ఇంటికే పసుపు, కుంకుమ, ప్రసాదాలు
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా బుకింగ్ సౌకర్యం
- మహిళలకు ఉచితంగానే ప్రయాణం

డిపోల వారీగా జాతరకు కేటాయించిన బస్సులు

డిపో	పల్లెవెలుగు	ఎక్స్‌ప్రెస్
నల్లగొండ	28	02
దేవరకొండ	36	18
నార్కట్‌పల్లి	02	0
మిర్యాలగూడ	18	02
యాదగిరిగుట్ట	30	12
కోదాడ	18	05
సూర్యాపేట	28	25
మొత్తం	160	64

ఏర్పాట్లు పూర్తి చేశాం..



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు మేడారం జాతర కోసం 224 బస్సులను కేటాయించాం. వరంగల్ రీజియన్‌కు 130, ఖమ్మం రీజియన్‌కు 94 బస్సులను కేటాయించాం. ఆ రెండు ఆర్టీసీ రీజియన్‌కు బస్సులతోపాటు డ్రైవర్లు, కండక్టర్లను కూడా పంపించడం జరుగుతుంది. మేడారం జాతరకు నడిపే బస్సుల్లో కూడా మహిళలకు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం ఉంటుంది. అదే విధంగా ప్రసాదం బుకింగ్ చేసుకునే వారికి ఆర్టీసీ ద్వారా వారికి చేరవేయడం జరుగుతుంది.


\- ఎస్.శ్రీదేవి, ఆర్ఎం, నల్లగొండ రీజియన్

ఎనిమిది రోజులు తప్పని ఇబ్బందులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏడు డిపోల నుంచి 224 బస్సులను మేడారం జాతర కోసం వరంగల్, ఖమ్మం రీజియన్‌కు తరలిస్తున్న నేపథ్యంలో ఎనిమిది రోజులపాటు ఉమ్మడి జిల్లాలో బస్సుల సంఖ్య తగ్గి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. రీజియన్‌లో 224 బస్సులు ఆ జిల్లాలోకి వెళితే ఎనిమిది రోజులపాటు ఉమ్మడి జిల్లాలో 48 సూపర్ లగ్జరీ బస్సులు, 70 డీలక్స్ బస్సులు, 14 పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మాత్రమే తిరగనున్నాయి. వీటికితోడు 246 అద్దెబస్సులతో కలిసి మొత్తం 378 బస్సులు అందుబాటులో ఉంటాయి. సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం లేనందున 246 అద్దె బస్సులు, మరో 14 పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే ఆ ఎనిమిది రోజులు మహిళలకు ఉచిత ప్రయాణ అవకాశం ఉంటుంది. దీంతో మహిళా ప్రయాణికులు కూడా రీజియన్ పరిధిలో తిరగడం కష్టమయ్యే అవకాశాలున్నాయి. రీజియన్‌లో 224 బస్సులు ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగుకు సంబంధించినవే. దీంతో మహిళా ప్రయాణికులకు కూడా ఎనిమిది రోజులపాటు ఇబ్బందులు ఎదుర్కోనున్నారు.



భక్తుల ఇంటికే పసుపు, కుంకుమ, ప్రసాదం



సమ్మక్క, సారలమ్మ భక్తులకు ఆర్టీసీ కార్గో ద్వారా భక్తుల ఇంటికే పసుపు, కుంకుమ, ప్రసాదాలను చేరవేయనుంది. ఇందుకుగాను దేవాదాయ శాఖతో ఆర్టీసీ ఒప్పందం చేసుకుంది. ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అమ్మవారి ప్రసాదాన్ని బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని భక్తులకు కల్పించింది. భక్తులు రూ.299 చెల్లించి సమీపంలోని టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) కౌంటర్ల లో ఏజెంట్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ల ద్వారా మేడారం ప్రసాదాన్ని బుక్ చేసుకోవచ్చు. ఈ ప్రసాదం బుకింగ్ సౌకర్యం తెలంగాణలోని అన్ని జిల్లాల్లో అందుబాటులో ఉంటుంది. బుక్ చేసుకున్న భక్తులకు మేడారం జాతర అనంతరం నేరుగా వారి ఇంటికే ప్రసాదాన్ని పంపించనున్నారు. రీజియన్‌లోని అన్ని డిపోల పరిధిలో విధులు నిర్వహించే ఎగ్జిక్యూటివ్‌లను సందర్శించి ఆర్డర్‌ను ఇచ్చే అవకాశం ఉంది. ఆన్‌లైన్ బుకింగ్ సమయంలో భక్తులు తమ చిరునామాతోపాటు పిన్‌కోడ్, ఫోన్‌నెంబర్‌ను నమోదు చేయాలి.

సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

అదనపు కలెక్టర్ ప్రియాంక



ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంక

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం నుంచి డీఆర్‌డీవోగా బదిలీపైవచ్చిన మధుసూదన్‌రాజు, ఖమ్మం నుంచి జడ్పీ సీఈవోగా బదిలీపై వచ్చిన వీవీ అప్పారావు, ఖమ్మం నుంచి డిప్యూటీ జడ్పీ సీఈవోగా బదిలీపై వచ్చిన శిరీష బుధవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా అదనపు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలించాలి

సూర్యాపేటఅర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంక అన్నారు. ఈవీఎం గోదాంలో నిర్వహిస్తున్న ఎలక్ట్రానిక్ యంత్రాల మొదటి లెవల్ చెకింగ్‌ను బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఈసీఐఐఎల్, ఇంజనీర్ల బృందం ఆధ్వర్యంలో ఫస్ట్ లెవల్ యంత్రాల చెకింగ్ పూర్తయిందని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బ్యాలెట్ యూనిట్‌లు, 2803, కంట్రోల్ యూనిట్‌లు 1742, వీవీప్యాట్లు 1848లకు మొదటి లెవల్ చెకింగ్ పూర్తయిందని తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ర్యాండం పద్ధతిలో నేడు మాక్ పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డీటీ వేణు తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి మహిళల కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీలు నిర్వహించే క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న నిర్వాహకులు

గరిడేపల్లి, ఫిబ్రవరి 14: ఆల్ ఇండియా మహిళా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని మాజీ సర్పంచ్ సుందరి నాగేశ్వరరావు కోరారు. మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న రవిందమాత ధ్యాన మందిర 52వ వార్షికోత్సవం కరపత్రాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడ్డిపల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న అరవింద మాత ధ్యాన మందిర ఉత్సవాల్లో భాగంగా ఈ సారి ఆల్ ఇండియా మహిళా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 12 రాష్ట్రాల మహిళా జట్లు పాల్గొనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.లక్ష, షీల్డ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నల్లగొండ, సూర్యాపేట కబడ్డి అసోషియేషన్ అధ్యక్షులు రామినేని భూలోకరావు, బెల్లంకొండ రాంచందర్, ఆర్గనైజర్లు బచ్చు ఉపేందర్, మేకల వెంకటేశ్వర్లు, బచ్చురమేష్, రామినేని దిలిప్, కర్నం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 14: మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని అదనపు కలెక్టర్ ప్రియాంక, మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన కోరారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో బుధవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో అన్ని శాఖలకు తగిన ప్రాధాన్యం కల్పించామన్నారు. పారిశుధ్యం, మంచినీటి వసతులు, శానిటేషన్, పట్టణ ప్రణాళిక, గ్రీన్ బడ్జెట్ తదితర అంశాలకు ప్రాధాన్యం కల్పించినట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2కోట్ల 14లక్షల 50 వేల అంచనాతో ప్రతిపాదనలు తయారుచేసి ఆమోదించినట్లు తెలిపారు. సాధారణ పరిపాలన, సిబ్బంది జీతభత్యాలకు రూ.28.90 లక్షలు, ఇంజనీరింగ్, నీటి సరఫరాకు రూ.23.06లక్షలు, శానిటేషన్, ప్రజారోగ్య కార్యక్రమానికి రూ.15.10లక్షలు, పట్టణ ప్రణాళికకు రూ.3లక్షలు, గ్రీన్ బడ్జెట్‌కు రూ.10.08 లక్షలు, డిపాజిట్లు రూ.25లక్షలు, ప్రభుత్వ గ్రాంట్లు 13.40లక్షలు ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదించినట్లు తెలిపారు. నీటి సరఫరా, శానిటేషన్‌కు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు కొమ్ము శ్రీను, కస్తాల శ్రావణ్‌కుమార్, సంపత్‌రెడ్డి, రామ్‌గోపి, కారింగుల విజయ, కుంట ఉపేంద్ర, దొంతగాని పద్మ, సతీష్, కెఎల్‌ఎన్‌రావు, రాజానాయక్, గాయత్రి, మంజుల, త్రివేణి, వరలక్ష్మీ, ఓరుగంటి నాగేశ్వరరావు, సౌజన్య, గురవయ్యగౌడ్, సరిత, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ సీఈవోగా అప్పారావు, డిప్యూటీ సీఈవోగా శిరీష బాధ్యతల స్వీకరణ

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 14: జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయ సీఈవోగా వీవీ. అప్పారావు, డిప్యూటీ సీఈవోగా శిరీష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ కార్యాలయ సిబ్బంది వారికి స్వాగతం పలికారు. మూడు సంవత్సరాలుగా సూర్యాపేట జడ్పీ సీఈవోగా పనిచేసిన జి. సురేష్ బదిలీపై యాదాద్రిభువనగిరి జిల్లాకు అడిషినల్ డీఆర్డీవోగా వెళ్లారు. ఆయన స్థానంలో ఖమ్మం జిల్లా జెడ్పీ సీఈవో వీవీ. అప్పారావును సూర్యాపేట జెడ్పీ సీఈవోగా బదిలీపై వచ్చారు. సూర్యాపేట జడ్పీ డిప్యూటీ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన శిరీష ఖమ్మం జిల్లాలో అడిషినల్ డీఆర్డీవోగా పనిచేశారు. ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది సహకారంతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేస్తామని వారు పేర్కొన్నారు. అంతకుముందు వారు అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకను కలెక్టరేట్‌లో మార్యదపూర్వకంగా కలిశారు.



జడ్పీ సీఈవో వీవీ. అప్పారావు, డిప్యూటీ సీఈవో శిరీషలకు స్వాగతం పలుకుతున్న జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది

అమర జవాన్లకు నివాళి

బ్లాక్ డే అక్షరాకృతిలో విద్యార్థుల ప్రదర్శన



పుల్వామా ఘటనలో అమరులైన 40మంది సీఆర్పీఎఫ్ జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని మఠంపల్లి మండల కేంద్రంలోని మాన్‌పోర్ట్ పాఠశాల విద్యార్థులు నివాళులర్పించారు. పాఠశాల మైదానంలో 'బ్లాక్‌డే' అక్షరాకృతిలో కూర్చున్నారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్లకు ఆత్మశాంతి కలగాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వినోద్‌రెడ్డి, పీఈటీ సతీష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● మఠంపల్లి

పోలీస్ అధికారుల బదిలీ

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 14: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న బదిలీల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. బుధవారం పోలీస్ శాఖలో పనిచేస్తున్న పలువురు పోలీస్ అధికారులతో పాటు మునిసిపల్ కమిషనర్లు కూడా బదిలీ అయ్యారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బదిలీ అయిన వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రదేశం	బదిలీ అయిన స్థానం
టి.వెంకటగిరి	డీఎస్పీ, మిర్యాలగూడ	ఏసీపీసీఎస్ అండ్ డీడీ, హైదరాబాద్
కె.శేఖరరాజు	ఏసీపీ టాస్క్‌ఫోర్స్, నిజామాబాద్	మిర్యాలగూడ, ఎస్‌డీపీవో
జి.రవి	డీఎస్పీడీసీఆర్‌బీ, సూర్యాపేట	ఎస్‌డీపీవో, సూర్యాపేట
పి.నాగభూషణం	ఎస్‌డీపీవో, సూర్యాపేట	రిపోర్టు డీజీపీ ఆఫీస్
	మునిసిపల్ కమిషనర్లు	
పి.రామాంజులరెడ్డి	సూర్యాపేట	యాదాద్రి భువనగిరి
బి.నాగిరెడ్డి	యాదాద్రి భువనగిరి	దోర్నకల్, మహబుబాబాద్
బి.శ్రీనివాస్	జీహెచ్‌ఎంసీ, డీసీ	సూర్యాపేట
డి.బాలయ్య	జీహెచ్‌ఎంసీ, డీసీ	నకిరేకల్
డి.శ్రీను	తిరుమలగిరి	నందికొండ నాగార్జునసాగర్
ఎ.రమాదేవి	మధిర, ఖమ్మం	కోదాడ
కె.లక్ష్మి	జీహెచ్‌ఎంసీ సెక్రటరీ	ఆలేరు, యాదాద్రి భువనగిరి
మున్‌వర్ అలీ	దోర్నకల్, మహబూబాబాద్	హాలియా
ఎస్.భాస్కర్‌రెడ్డి	వనపర్తి	దేవరకొండ
ముసాబ్ అహ్మద్	ఏఎంసీ, నల్లగొండ	జాల్‌పల్లి, రంగారెడ్డి

పదోన్నతి బాధ్యతను పెంచుతుంది

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 14: పదోన్నతి బాధ్యతను పెంచుతుందని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. పదోన్నతులు పొందిన పోలీసులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న తొమ్మిది మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా పదోన్నతి లభించిందని తెలిపారు. పోలీసులు బాధ్యతలకు అనుగుణంగా విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలు అందించి వారి మన్ననలను పొందాలన్నారు. అనంతరం పదోన్నతులు పొందిన సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్ పాల్గొన్నారు.



ఏఎస్‌ఐలుగా పదోన్నతులు పొందిన హెడ్‌కానిస్టేబుళ్లను అభినందిస్తున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే


పోలీస్ కుటుంబాలకు 'చేయూత' అండ


పోలీస్ శాఖలో సిబ్బంది కోసం అమలు చేస్తున్న చేయూత పథకం పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. ఆర్మూర్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సైదులు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి చేయూత పథకం ద్వారా రూ. 2లక్షల చెక్కును జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. ఈ చేయూత పథకానికి ప్రతి నెలా విరాళం అందజేస్తున్న జిల్లా సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, ఆర్ఎస్ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



హోంగార్డు మృతి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 14: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు నవకిషోర్ కేసులో ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శివకుమార్ తెలిపారు. అతివేగంగా కారు నడుపుతూ హోం గార్డుపైకి దూసుకువచ్చిన కారు డ్రైవర్ ప్రశాంత్‌తో పాటు కింద పడిన తర్వాత ఢీకొట్టిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత కారు డ్రైవర్ పీయూష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 13న మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండలో నిర్వహించిన బహిరంగ సభ బందోబస్తుకు హాజరైన నార్కట్‌పల్లికి చెందిన హోంగార్డు నవకిషోర్ చర్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఘటనలో మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.
















పంపకాలకు వేళాయే!

- ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు
- 19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు
- తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11,356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో గత నెలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారులతో కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అనంతరం ఉమ్మడి ఆస్తుల విభజనపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరిసమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

58:42 నిష్పత్తిలో పంపకాలు..

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. కాగా, భవన్ పంపకాలలో ఏపీకి 58.32శాతం, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పటౌడీ హౌస్‌లోని 5.245 ఎకరాల్లో నూతన తెలంగాణ భవన్ నిర్మించేందుకు సిద్ధమవుతోంది.



తమ సోదరుడి పాడె మోస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రవి

సోదరుడికి కన్నీటి వీడ్కోలు పలికిన భట్టి

- పాడె మోసి నివాళులు

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఆయుష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి ఆయన పాడె మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ముందు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్థుల సందర్శనార్థం అక్కడ ఉంచారు. ఆ తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు

- మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు 95 మంది డీఎస్పీలకు స్థానచలనాలు
- జీహెచ్‌ఎంసీలో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 114 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఉత్తర్వులిచ్చింది. మంగళవారం 40 మంది కమిషనర్లను బదిలీ చేయగా బుధవారం మరో 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రధానంగా జీహెచ్ఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మునిసిపల్ కమిషనర్ల బదిలీ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏళ్లుగా జీహెచ్ఎంసీ పరిధిలో తిష్టవేసిన పలువురు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్ డీఏవోగా అభిమన్యు, భద్రాద్రి కొత్తగూడెం డీఏవోగా బి.బాబూరావు, సూర్యాపేట డీఏవోగా శ్రీధర్‌రెడ్డిని నియమించారు. పలు డివిజన్లకు ఏడీఏలను కూడా మార్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సివిల్, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 95 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 110 మంది డీఎస్పీలు బదిలీ కాగా రెండో జాబితాలో మరో 95 మందిని బదిలీ చేశారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రేపు సార్వత్రిక సమ్మె

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు, రైతుసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చాయని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల తరఫున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పోటు రంగారావు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) చలపతిరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రజాహిత యాత్రలో బండి సంజయ్

'కాళేశ్వరం' బాధ్యులను ఎందుకు అరెస్టు చెయ్యలే?

- ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అంతేకాక, ఎన్నికల టికెట్ కోసం కన్నకొడుకు పేరునే మార్చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కేటీఆర్ అసలు పేరు కల్వకుంట్ల అజయ్‌రావు అని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో బండి సంజయ్ బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకున్న కేసీఆర్.. అజయ్‌రావును తీసుకెళ్లి మీ పేరే పెట్టుకున్నానని ఆయనకు చెప్పి టికెట్ తెచ్చుకున్న మోసగాడు కేసీఆర్ అని విమర్శించారు. అబద్ధాలు, మోసాల్లో కేటీఆర్ అయ్యను మించిపోయాడని ఎద్దేవా చేశారు. అయ్య(కేసీఆర్) ఏక్ నంబర్ అయితే కొడుకు(కేటీఆర్) దస్ నంబరని అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1,408 కోట్ల నిధులు ఇచ్చిందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే రాముడికి ఓటు వేసినట్లేనని తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం న్యాయమా? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని, ఎన్నికల కోడ్ నెపంతో ఆ పార్టీ నేతలు తప్పించుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో 2 లక్షల మందికి 'ముఫ్త్ బిజిలీ'!

(మొదటి పేజీ తరువాయి)

తొలిదశలో భాగంగా 34,59,585 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రధాని మోదీ ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజన రాష్ట్రంలో సంపూర్ణంగా అమలయితే దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వంపై గృహజ్యోతి భారం స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, ప్రతీ నెల 150 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంది. దీనికి రూ.1.10 లక్షలు వ్యయం కానుండగా... రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.50 వేలు సొంతంగా పెట్టుకోవాలి. 150 యూనిట్ల విద్యుత్ వాడకానికి నెలకు రూ.700 దాకా బిల్లు వచ్చే అవకాశం ఉండగా... సోలార్ యూనిట్‌తో రూ.625 మేర ఆదా అవుతుందని, బిల్లు కేవలం రూ.75 మాత్రమే చెల్లించే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర పథకం కింద రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పు మీద) సోలార్ యూనిట్లు పెట్టుకుంటే... వేసవిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విద్యుత్‌ను సొంతంగా వాడుకోవచ్చు లేదా డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. చీకటిపడ్డాక సౌరవిద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది కాబట్టి ఆ సమయంలో బ్యాటరీలో నిల్వ చేసిన కరెంట్‌ను లేదా డిస్కమ్‌లు సరఫరా చేసే కరెంట్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. కాగా, వినియోగదారుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధరను కేంద్రం ఖరారు చేయనుంది.

యూనిట్ల వినియోగం	సోలార్ ప్లాంట్	వ్యయం	కేంద్రం సబ్సిడీ	వినియోగదారుడు భరించాల్సింది
0-100	1 కిలోవాట్	రూ.60 వేలు	రూ.30 వేలు	రూ.30 వేలు
150	2 కిలోవాట్లు	రూ.1.10 లక్షలు	రూ.60 వేలు	రూ.50 వేలు
300	3 కిలోవాట్	రూ.1.65 లక్షలు	రూ.78 వేలు	రూ. 87 వేలు

ముఫ్త్ బిజ్లీ యోజన

ముఫ్త్ బిజ్లీ యోజనలో ఒక కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువ కిలోవాట్ సోలార్ ప్లాంట్లకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

భారీగా పెరిగిన సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో కేంద్రం 3 కిలోవాట్లదాకా 40 శాతం సబ్సిడీ ఇస్తుందేది. అయితే, క్రమేణా దీనిని తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున 3 కిలోవాట్లకు రూ.54 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. 3 కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల దాకా కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇక అపార్టుమెంట్లు వంటి గ్రూప్ హౌసింగ్‌కు కిలోవాట్‌కు రూ.9 వేల దాకా సబ్సిడీ లభిస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజనలో సబ్సిడీని భారీగా పెంచారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం http://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత ఇంటి పైకప్పు మీద సోలార్ యూనిట్ పెట్టుకోవచ్చు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 80 మంది, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో 82 మంది సోలార్‌ప్లాంట్ విక్రేతలు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన 36 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెం టౌన్/వైరా/సూర్యాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొత్తగూడెం, సూర్యాపేట మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌తో పాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నో హై డ్రామాల మధ్య సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్ఎస్ నిలబెట్టుకున్నప్పటికీ బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం చేజారిపోతున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఆశించిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను, ఆమె భర్త దిలీప్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వైభవంగా వసంత పంచమి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్, శాలిగౌరారం మండలం అడ్లూరులోని శ్రీవీణ, గాన నిత్య సరస్వతీ ఆలయం, కనగల్ మండలం దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ ఆలయం, నార్కట్‌పల్లిలోని శ్రీ కృష్ణవేణి హైస్కూల్, హాలియాలోని టైం, న్యూకిడ్స్ పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. నకిరేకల్‌లోని శ్రీ ఐశ్వర్యసాయి మందిరం, మిర్యాలగూడ మండలం అవంతీపురం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని ఎస్వీ హైస్కూల్, తేజ, పాఠశాలల్లో అక్షరాభ్యాసం నిర్వహించారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండలోని హరిహర త్రిశక్తి క్షేత్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. చౌటుప్పల్‌లోని ట్రినిటీ పాఠశాల, భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్టలోని సాయిబాబా, హగ్రీవస్వామి ఆలయాల్లో వేర్వేరుగా వేడుకలు నిర్వహించారు.

● ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్



కనగల్ మండలం దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ ఆలయంలో అక్షరాభ్యాసం



నల్లగొండ తులసీనగర్ హనుమాన్ ఆలయంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



చౌటుప్పల్ పట్టణంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు



మిర్యాలగూడ మండలం అవంతీపురంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు



వలిగొండ హరిహర త్రిశక్తి క్షేత్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకుడు




కోదాడలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

ముళ్ల పొదల్లో ఆడ శిశువు

మఠంపల్లి, ఫిబ్రవరి 14: ముళ్ల పొదల్లో గుక్కపట్టి ఏడుస్తున్న శిశువును గమనించిన స్థానికులు కంపచెట్ల నుంచి బయటికి తీసి ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం సుల్తాన్‌పురంతండా సమీపంలోని మట్టపల్లి పునరావాస కేంద్రం సమీపంలో ఈ సంఘటన జరిగింది. బుధవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన కొందరు సమీపంలోని కంపచెట్లలో గుక్కపట్టి ఏడుస్తున్న పసి కందును చూసి తండాకు చెందిన అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అంగన్‌వాడీ టీచర్ ఉమా, ఆశ కార్యకర్త శాంతి పసికందును బయటకు తీసి స్నానం చేయించి దుస్తులు వేసి మఠంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. వైద్యాధికారి సుధాకర్‌నాయక్ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఐసీడీఎస్ అధికారులు హుజూర్‌నగర్‌కు తరలించారు. శిశువుకు ముళ్లు గుచ్చుకోవడంతో తొలగించి చికిత్స అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. శిశువు పుట్టి రెండు, మూడు రోజులు అయిఉండొచ్చని, 2.7కిలోల బరువు ఉందని సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం శిశువుకు మహిళా శిశు సంరక్షణ అధికారులు సాయి, వంశీ పర్యవేక్షణలో వైద్యం అందిస్తున్నారు. శిశువు లభ్యమైన స్థలం ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులో ఉండడంతో కంపచెట్లలో ఎవరు వదిలేసి వెళ్లారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. సంఘటనా స్థలంలో సీసీ కెమెరాలు లేకపోవటం, జనసంచారం లేని ప్రాంతం కావడంతో సమాచారం తమకు తెలియజేయాలని కోరారు.

జన్మభూమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో పొగలు



మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో నిలిచి ఉన్న జన్మభూమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు

మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 14: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణం వెళుతున్న జన్మభూమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు రావడంతో నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో 25నిమిషాలు నిలిపారు. సికింద్రాబాద్ నుంచి బుధవారం ఉదయం 7.10గంటలకు బయలుదేరిన జన్మభూమి సూపర్‌ఫాస్ట్ ట్రైన్ ఉదయం 9 గంటల సమయంలో కుక్కడం స్టేషన్ దాటుతుండగా రిజర్వేషన్ బోగీ(డీ3) కింది నుంచి పొగలు వచ్చాయి. వెంటనే గమనించిన ప్రయాణికులు రైల్వేసిబ్బందికి సమాచారం అందజేశారు. అప్పటికే మిర్యాలగూడ స్టేషన్ సమీపించగా సిబ్బంది రైలును మిర్యాలగూడ స్టేషన్‌లో నిలిపివేశారు. పొగలు వచ్చిన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిన నిపుణులు వీల్ బేరింగ్‌లలో సాంకేతిక లోపాన్ని గుర్తించి మరమ్మతులు చేశారు. 25నిమిషాల అనంతరం జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్టణం బయలుదేరింది.

నేటినుంచి పాతగుట్టలో అధ్యయనోత్సవాలు

● *19 నుంచి 25వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు*



యాదగిరిగుట్ట (పాతగుట్ట) ఆలయ ప్రధాన ముఖద్వారం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 14: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయమైన పాతగుట్ట(పూర్వగిరి) లక్ష్మీనృసింహుడి సన్నిధిలో గురువారం నుంచి వార్షిక అధ్యయనోత్సవాలకు, ఈ నెల 19నుంచి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలకు సంప్రదాయ రీతిలో శ్రీకారం చుట్టనున్నారు. పాతగుట్ట ఆలయంలో కొనసాగే లక్ష్మీనృసింహుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొని అలంకారసేవలను దర్శించుకుని తరించేందుకు యాత్రికులు కుటుంబసమేతంగా పెద్ద సంఖ్యలో వస్తారు. ఇందుకోసం దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందస్తుగా అధ్యయనోత్సవాలను నిర్వహించడం ఆలయ సంప్రదాయం. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆళ్వారాచార్యులు, లక్ష్మీనృసింహుడిని దివ్యమనోహరంగా అలంకరించి దివ్యప్రబంధ వేదపఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ తిరవీధుల్లో విహరింపజేస్తారు. శ్రీవైష్ణవ ఆలయాల్లో ఆలయ ప్రాశస్త్యం మరింత ఇనుమడింపజేసేందుకు అధ్యయనోత్సవాలు నిర్వహించడం ఆచారం. తొలి రోజున దేవతల సేనా నాయకుడు విశ్వక్సేనుడికి తొలిపూజలతో అధ్యయనోత్సవాలను ఆరంభిస్తారు. నమ్మాళ్వార్ రచించిన దివ్యప్రబంధ వేద పఠనాలతో కొనసాగే అధ్యయనోత్సవాలు చివరి రోజున నమ్మాళ్వార్ పరమపదోత్సవ ఘట్టాలతో ముగుస్తాయి. అధ్యయనోత్సవాలు ముగిసిన మరుసటి రోజు నుంచి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు ఆరంభమవుతాయి. పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఈ నెల 19వ తేదీ నుంచి 25వ తేదీ ఆదివారం వరకు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ వరకు పాతగుట్ట ఆలయంలో నిత్యతిరుకల్యాణోత్సవ సేవను రద్దు చేయనున్నారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యవిధి కైంకర్యాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో నిత్యపూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపిన ఆచార్యులు గర్భాలయంలోని స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠా అలంకార కవచమూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసిదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి గజవాహన సేవను ఊరేగించిన అర్చకులు విశ్వక్సేనుడికి తొలి పూజలతో నిత్యతిరుకల్యాణోత్సవాన్ని ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. అనుబంధ పాతగుట్ట ఆలయంలోనూ నిత్య పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.18,09,710 ఆదాయం సమకూరింది. భూదాన్‌పోచంపల్లికి చెందిన పద్మశాలి మహాజన సంఘం తీసుకువచ్చిన పట్టుపోగులకు అర్చకబృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది.

కాలపరిమితి ముగిసిన ఔషధాల పంపిణీ

● *నల్లగొండ జిల్లా చింతపల్లిలో సంఘటన*

చింతపల్లి, ఫిబ్రవరి 14: నల్లగొండ జిల్లా చింతపల్లి పల్లె దవాఖానాకు వచ్చిన రోగులకు కాల పరిమితి ముగిసిన ఔషధాలను సూపర్‌వైజర్ అందజేశారు. బుధవారం దవాఖానాకు వచ్చిన రోగుల తరఫు బంధువులు గుర్తించి ప్రశ్నించటంతో పొరపాటైందని ఆమె సమాధానమిచ్చారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం 2023 ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసింది. అందులో భాగంగా చింతపల్లి మండల కేంద్రంలో పల్లె దవాఖానాను ఏర్పాటు చేశారు. వైద్యాధికారి, స్టాఫ్ నర్సుతో పాటు మరో ఇద్దరు వైద్య సిబ్బంది ఉండాల్సి ఉండగా వైద్యాధికారి పోస్టు భర్తీ చేయకపోవడంతో ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్‌తో పల్లె దవాఖానా నడుస్తోంది. ఈ పల్లె దవాఖానాకు ప్రతీ రోజు సుమారు 10నుంచి 30 మంది వరకు రోగులు వచ్చి వెళుతుంటారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఎన్ఎం జయ ఇటీవల కుర్మపల్లికి బదిలీకాగా, పీహెచ్‌సీలో పనిచేసే సూపర్‌వైజర్ విజయ, మూడో ఏఎన్ఎం అశ్విని విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం కొంతమంది రోగులు పల్లె దవాఖానాకు రాగా వైద్యపరీక్షలు నిర్వహించిన సూపర్‌వైజర్ విజయ వారికి టాబ్లెట్లు, సిరప్ అందజేశారు. బుధవారం గ్రామానికి చెందిన శంషుద్దీన్ బంధువును పల్లె దవాఖానాకు తీసుకురాగా సిబ్బంది వారికి కాలపరిమితి దాటిన సిరప్, టాబ్లెట్లను ఇచ్చారు. జూలై 2023వ తేదీవరకే కాలపరిమితి ఉన్న సిరప్ ఇవ్వడం ఏమిటని శంషుద్దీన్ సూపర్‌వైజర్ విజయను ప్రశ్నించగా, తాను 10 రోజుల క్రితమే వచ్చానని, పొరపాటైందని పేర్కొన్నారు.

సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం: డాక్టర్ శ్రీదేవి, పీహెచ్‌సీ, చింతపల్లి

పల్లె దవాఖానాలో ఉన్న గడువు తీరిన ఔషధాలను పీహెచ్‌సీకి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. పల్లె దవాఖానాలో మందులు అయిపోతే పీహెచ్‌సీ నుంచి తీసుకోవాలి. పల్లె దవాఖానాకు వచ్చిన రోగులకు కాలం చెల్లిన మందులు ఇచ్చిన వైద్య సిబ్బందిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

శాలిగౌరారంలో హైనా కదలికలు

శాలిగౌరారం, ఫిబ్రవరి 14: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని మంగమ్మగూడెం, జాలోనిగూడెం, తిర్మలరాయునిగూడెం గ్రామ పరిసరాల్లో హైనా సంచరిస్తున్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. మండలంలోని తిర్మలరాయునిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని మంగమ్మగూడెం శివారులోని మద్ది రాజశేఖర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రెండు మూడు రోజుల నుంచి హైనా సంచరిస్తున్నట్లు తెలిసింది. హైనా కాలి ముద్రలను వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్న నూతి సత్యనారాయణ చూసి ఫారెస్టు అధికారులకు బుధవారం సమాచారం అందజేశారు. నకిరేకల్, మిర్యాలగూడ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు అశోక్‌రెడ్డి, సతీష్‌కుమార్, బీట్ ఆఫీసర్లు మమత, గిరిబాయి వచ్చి పరిశీలించారు. పరిసర ప్రాంతాల రైతులను హైనా సంచరించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. కాలి ముద్రలను వారు స్కేల్‌తో కొలిచి రికార్డు చేశారు. ఇది హైనానా, మరేదైనా జంతువా అనేది నిర్ధారణ కావాల్సి ఉందని వారు తెలిపారు.

హ్యాండ్‌బాల్ క్రీడకు ఆదరణ

నకిరేకల్, ఫిబ్రవరి 14: హ్యాండ్‌బాల్ క్రీడకు మంచి ఆదరణ ఉన్నందున క్రీడాకారులు ఆసక్తి చూపాలని మండల నోడల్ అధికారి, పాఠశాల హెచ్ఎం కర్ర వీరారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం మంగళపల్లి ఉన్నత పాఠశాలలో ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ పురుషులు, మహిళల హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతి క్రీడాకారుడు ఒక లక్ష్యాన్ని ఎంచుకున్నప్పుడే క్రీడల్లో రాణిస్తారన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య మాట్లాడుతూ ఉమ్మ డి జిల్లా నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారని పురుషుల నుంచి 16 మంది, మహిళల నుంచి 16 మంది చొప్పున ఎంపిక చేశారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17నుంచి 19వ తేదీ వరకు కరీంనగర్ జిల్లాలో 52వ సీనియర్ పురుషులు, మహిళలు హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, అనిల్‌రెడ్డి, సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు అధికారులు నిరంతరం కృషి చేయాలని అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అన్నారు. బుధవారం జిల్లాకు బదిలీపై వచ్చిన పలువురు అధికారులు కలెక్టరేట్‌లో ప్రియాంకను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లా అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

జిల్లాలో పలువురు అధికారులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించినవారిలో మునిసిపల్ కమిషనర్లు, పోలీస్ సిబ్బంది, ఎంపీడీవోలు ఉన్నారు. వీరందరికి ఆయా కార్యాలయాల సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తిరుమలగిరి: తిరుమలగిరి మునిసిపల్ కమిషనర్‌గా రామదుర్గారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో తిరుమలగిరి మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కోదాడ: పట్టణ మునిసిపల్ కమిషనర్‌గా రమాదేవి బాధ్యతలు స్వీకరించారు. రమాదేవి మధిర నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కోదాడలో పనిచేసిన వెంకటేశ్వరనాయక్ చౌటుప్పల్‌కు బదిలీ అయ్యారు.

కోదాడ: కోదాడ డీఎస్పీగా శ్రీధర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నల్గొండ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కోదాడలో పనిచేసిన ప్రకాష్ ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు.

కోదాడ రూరల్: కోదాడ రూరల్ సీఐగా రజితరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన రామకృష్ణారెడ్డి మునగాల సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఈ స్థానంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న రజితరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. రజితరెడ్డి గతంలో కోదాడ టౌన్ సీఐగా పనిచేశారు.

నూతన్‌కల్: ఎంపీడీవోగా పి.సునీత బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఇందిర బదిలీపై యాదాద్రి జిల్లాకు వెళ్లగా ఆమె స్థానంలో సునీత ఇక్కడికి వచ్చారు.



రామదుర్గారెడ్డి కమిషనర్ తిరుమలగిరి



రమాదేవి కమిషనర్ కోదాడ



శ్రీధర్‌రెడ్డి డీఎస్పీ కోదాడ

చిలుకూరు: ఎంపీడీవోగా కందాల గిరిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో ఈదయ్య భద్రాది కొత్తగూడెం జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో డిండి మండలం ఎంపీడీవోగా పనిచేసిన గిరిబాబు బాధ్యతలు స్వీకరించారు.

నేరేడుచర్ల: ఎంపీడీవోగా డి.సోమసుందర్‌రెడ్డిని బాధ్యతలు స్వీకరించారు. సోమసుందర్‌రెడ్డి బదిలీపై నల్గొండ నుంచి ఇక్కడికు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో శంకరయ్యను భువనగిరి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

మేళ్లచెర్వు: ఎంపీడీవోగా ఖాజా అజ్గర్‌అలీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో నల్గొండ జిల్లాలోని సాగర్, తిరుమలగిరిలో పనిచేశారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఇసాక్ హుస్సేన్ బదిలీపై నాగర్‌కర్నూల్‌కు వెళ్లారు.

పెన్‌పహాడ్: ఎంపీడీవోగా జంజనం వెంకటేశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. వెంకటేశ్వరరావు మర్రిగూడెం మండలంలో 18నెలలు పనిచేసి పెన్‌పహాడ్‌కు బదిలీపై వచ్చారు. పెన్‌పహాడ్ మండలంలో రెగ్యులర్ ఎంపీడీవో లేనందున సూపరింటెండెంట్ శీనివాస్ ఇన్‌చార్జిగా కొనసాగారు.

తిరుమలగిరి: ఎంపీడీవోగా బి.లాజర్ బాధ్యతలు స్వీకరించారు.

సూర్యాపేట రూరల్: సూర్యాపేట ఎంపీడీవోగా జి.బాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. పీఏపల్లి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

మద్దిరాల: ఎంపీడీవోగా ఎం.సత్యనారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మద్దిరాల ఎంపీడీవో సరోజ నల్లగొండకు బదిలీ అయ్యారు.

మునగాల రూరల్: మునగాల ఎంపీడీవోగా కె.రమేష్‌దీన్‌దయాల్ బాధ్యతలు స్వీకరించారు.



అదనపు కలెక్టర్‌ప్రియాంకకు పుష్పగుచ్ఛం అంజేస్తున్న డీఆర్‌డీవో, జడ్పీసీఈవో, జడ్పీ డిప్యూటీ సీఈవో

ఆత్మకూర్(ఎస్): ఎంపీడీవోగా మహ్మద్ హసీం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన మల్సూర్‌నాయక్ సంగారెడ్డి జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో హసీం బాధ్యతలు చేపట్టారు.

తుంగతుర్తి: ఎంపీడీవోగా శేషుకుమార్ బాధ్యతలు స్వీకరించారు నల్లగొండ జిల్లా నాంపల్లి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

పేట మునిసిపల్ కమినర్‌గా శ్రీనివాస్

సూర్యాపేట టౌన్: సూర్యాపేట మునిసిపల్ కమిషనర్‌గా బి. శ్రీనివాస్‌ను నియమిస్తు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లో డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న బి.శ్రీనివాస్ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. అదేవిధంగా సూర్యాపేట మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రామాంజులరెడ్డి భువనగిరిఇ బదిలీ అయ్యారు.

● భువనగిరి మునిసిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న రామాంజులరెడ్డికి సూర్యాపేట మునిసిపల్ కార్యాలయంలో పలువురు మునిసిపల్ సిబ్బంది, అధికారులు వీడ్కోలు పలికారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

సూర్యాపేట క్రైం, ఫిబ్రవరి14: జీవితంపై విరక్తి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.సూర్యాపేట పట్టణ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రెండో విడత ఇందిరమ్మకాలనీలో నివసించే సూరారపు జాన్(45)పెయింటింగ్ పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. అయన భార్య ఏడేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించింది. అప్పటి నుంచి జాన్ ఇద్దరు కమారులతో కలసి జీవిస్తున్నారు. భార్య మృతితో మనస్తాపం చెంది మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుమారులు నిద్రలేచేసరికి తండ్రి మృతి చెంది ఉన్నాడు. పెద్ద కుమారుడు సాయితేజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

మునగాల, ఫిబ్రవరి 14: మండలంలోని రేపాల గ్రామంలో విద్యుదాఘాతంతో మంగళవారం రాత్రి ఒకరు మృతి చెందారు. ఎస్ఐ బి.అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రేపాల గ్రామానికి చెందిన రాపోలు మణెమ్మ ఇంటిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని ఎదురింటిలో నివసిస్తున్న పెద రామిరెడ్డి(48)కి తెలిపింది. అయన వెళ్లి మరమ్మతు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

చికిత్స పొందుతూ..

మునగాల, ఫిబ్రవరి 14: మండంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ బి.అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మండవ నర్సయ్య(40) అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెంది వారం రోజుల క్రితం పురుగు మందు తాగాడు. హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చిక్సిత్స పొందుతూ బుదవారం తెల్లవారుజామున మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌పై ఫిర్యాదు

తిరుమలగిరి, ఫిబ్రవరి 14: సీఎం రేవంత్‌రెడ్డిని దుర్భాషలాడిన మాజీఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై.నరేష్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి కిషోర్‌కుమార్ క్షమాపణ చెప్పాలన్నారు. కిషోర్‌కుమార్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సుంకరి జనార్దన్, తిరుమని యాదగిరి, కౌన్సిలర్ భాస్కర్, రాముగౌడ్, దాచెపల్లి వెంకన్న, మోహన్, చంటి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మట్టితరలిస్తే చర్యలు

మోతె, ఫిబ్రవరి 14: ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్‌టీ ప్రకాశ్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని మామిళ్లగూడెంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఆరు, ట్రాక్టర్లు, రెండు ఎక్స్‌కవేటర్లను స్వాధీనం చేసుకుని జరిమానా విధించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు.

16న ఇంటర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష

భానుపురి, ఫిబ్రవరి 14: ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 16న ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట డీఐఈవో కృష్ణయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. 20 మార్కులకు ఏడు మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. 17న ఎథిక్స్ (మానవ నైతిక విలువలు)పరీక్ష ఉందని, గత సంవత్సరం ప్రథమ సంవత్సరం చదివి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కూడా ఈ పరీక్ష రాయవచ్చన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 19న పర్యావరణ పరీక్ష ఉందన్నారు. ప్రతి జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఖచ్చితంగా ప్రాక్టికల్ పరీక్షలు రాయాలన్నారు. సందేహాలు ఉంటే ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలన్నారు.

గుడిసెలను తొలగిస్తే ఊరుకోం: బీఎస్పీ

మేళ్లచెర్వు, ఫిబ్రవరి14: చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు కాలనీలో పేదల గుడిసెలను బీఎస్పీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాపోలు నవీన్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో పేదలు గుడిసెలు నిర్మించుకొని నివసిస్తున్నారని, ప్రాజెక్టు పేరుతో పేదల గుడిసెలను తొలగిస్తే ఊరుకునేదిలేదని ఆయన హెచ్చరించారు. పేదలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పుష్పానంద్, నర్సింహారావు, సతీష్‌రెడ్డి, నాగార్జున, వెంకటేశ్వర్లు, పోలె వెంకన్న పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 14: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య అన్నారు. మండలంలోని రెడ్లకుంట గ్రామంలో బుధవారం రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాటాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కృష్ణకుమారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, కనగాల నాగేశ్వరరావు, కునుకుంట్ల శ్రీను, రోషయ్య, ప్రసాద్, శివ, సత్యనారాయణ, రామారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 14: ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని కులవివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కేవీపీఎస్ క్యాలెండర్లను ఆవిష్కరిచి మాట్లాడారు. మోదీ పాలనలో దళితులు, గిరిజనులపై దాడులు, దౌర్జన్యాలు, నిర్బంధాలు పెరిగాయన్నారు. నిరుద్యోగం పెరిగిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించారన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో మీసాల వీరబాబు, అబ్రహం, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

అమర సైనికుల కుటుంబాలకు అండగా ఉండాలి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 14: భారత సైనికుల కుటుంబాలకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి అన్నారు. పుల్వామా దాడిలో అమరులైన భారత సైనికుల చిత్రపటాలకు పట్టణంలో బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుల్వామా దాడిలో అమరులైన దేశ సైనికుల కుటుంబాలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ దేశం కోసం త్యాగం చేసిన అమరువీరుల ఆశయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో వీర్లపాటి గాయత్రి భాస్కర్ సతీష్, కుంట ఉపేంద్ర, జెసడీ, కొమ్ము శ్రీనివాసు, సౌజన్య, మంజుల, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గీత కార్మికులకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గరిడేపల్లి, ఫిబ్రవరి 14: గీత వృతి కార్మికులకు ప్రభుత్వం అండగా ఉం టుందని భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖా మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని గడ్డిపల్లి, ఖుతుబ్ షాపురం గ్రామాలకు చెందిన గీత కార్మికులు పెండెం సోమయ్య, కారింగుల వెంకయ్య తాటిచెట్టుపై నుంచి పడి గాయపడడంతో ఆస్పత్రి ఖర్చుల కింద కార్పొరేషన్ ద్వారా మంజూరైన చెరో రూ.15వేల చెక్కులను హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధిత కుటుంబసభ్యులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల గీత కార్మికులకు అన్ని విధాలుగా తనవంతు సహకారం అందిస్తానన్నారు. ప్రభుత్వం గీత కార్మికులకు అందించే ఎక్స్‌గ్రేషియా రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌండిన్య గౌడ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎస్ఎన్. ప్రసాద్, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 20 నుంచి బ్రహ్మోత్సవాలు

అర్వపల్లి, ఫిబ్రవరి 14: ఈనెల 20 నుంచి మండల కేంద్రంలోని యోగనందలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 20న తొళ్లక్కం ద్రావిడ పఠనం, 21న అధ్యయనోత్సవం, 22న పరమపధోత్సవం, 23న ధ్వజారోహణం, 24న కల్యాణం, 25న గరుడోత్సవం, 26న సధ్యాన రథోత్సవం, 27న చక్రతీర్థం, పూర్ణాహుతి, 28న పొన్నోత్సవం, 29న హనుమంతుని సేవ, మార్చి 1న హంసవాహన సేవ, 2న గజవాహనసేవ, 3న శేషవాహన సేవ, 4న దేవరాజ సేవ, 5న పారువేట, 6న దొంగల తోపు, 7న డోలోత్సవం, 8న వేముచేయుట కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాలను 10 తరాల అర్చకులు వంశపారపర్యంగా వికానస సంప్రదాయ ప్రకారం నిర్వహిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి పునఃప్రతిష్ఠ భూమి పూజ

ఆత్మకూర్(ఎస్), ఫిబ్రవరి 14: మండలంలోని బొప్పారం గ్రామంలో బుధవారం బొడ్రాయి స్థాపనకు భూమి పూజ నిర్వహించారు. ఈ శంకుస్థాపన మహోత్సవంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామస్థులు బొడ్రాయిని పునఃప్రతిష్ఠించడంఅభినందనీయమన్నారు. గ్రామస్థులందరూ ఐక్యంగా గ్రామ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, టీపీసీసీ రాష్ట్ర నాయకుడు భాషపంగు భాస్కర్, బొడ్రాయి కమిటీ చైర్మన్ నల్లు ఉపేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గోపగాని పెద్ద వెంకన్నగౌడ్, బొడ్రాయి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మార్చి 16న అదనపు సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 14: పట్టణంలో మార్చి 16న అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించడానికి హైకోర్టు జడ్జీలు హాజరవుతున్నట్లు అయన తెలిపారు. హుజూర్‌నగర్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలోమార్చి 8న న్యాయవాదుల స్పోర్ట్స్ మీట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశంలో నారపరాజు శ్రీనివాసరావు, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, రాఘవరావు, నవీన్, బాలకృష్ణ, ప్రవీణ్, సురేష్, నాగార్జున, అంజయ్య, శ్రీను, క్రాంతి పాల్గొన్నారు.

గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తా

మునగాల రూరల్, ఫిబ్రవరి 14: మండలంలోని ఈదులవాగు తండా గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వరు అన్నారు. బుధవారం ఈదులవాగు తండాలో ఎమ్మెల్యే పద్మావతి నిధులు రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బోడ సైదమ్మ, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు జిల్లేపల్లి బానోత్ నాగరాజు, సతీష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జాను, చందూలాల్, బాలకోటి, హుస్సేన్, సుధాకర్, కిట్టు, ఇంద్రారెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

'ఏఎస్‌రావు' ఫలితాల్లో 'జయ' విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 14: డాక్టర్ ఏఎస్‌రావు అవార్డు కౌన్సిల్ 33వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ ఫైనల్ లెవల్‌లో జయ పాఠశాల విద్యార్థులు ఆలిండియా మొదటి ర్యాంకుతో పాటు 13మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. 10వ తరగతి నుంచి షేక్ నేహా ఆలిండియా 1వ ర్యాంకు, గుడిపాటి పవన్ 10వ ర్యాంకు, పోతుగంటి అనురుద్ 12వర్యాంకు, గోపగాని శ్రీనిఖ 17వ ర్యాంకు, రేపాల జితేంద్రసాయిప్రసాద్ 23వ ర్యాంకు, గుగులోతు రాంచరణ్ 27వ ర్యాంకు, రుద్రంగి లలిత్‌సాయి 28వ ర్యాంకు, గుత్తికొండ అభినవ్‌రెడ్డి 28వ ర్యాంకు, పసుపులేటి అక్షర మైత్రేయి 31వ ర్యాంకు, 9వతరగతి నుంచి వల్లభనేని హాసిని 9వ ర్యాంకు, చిత్తలూరి అక్షయి 14వ ర్యాంకు, రంగ సుహాన్ 14వ ర్యాంకు, ఏలమకొండ విక్రాంత్ 27వ ర్యాంకు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు జెల్లపద్మ, బింగి జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న జయ వేణుగోపాల్

సిటీ టాలెంట్ విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేట అర్బన్, భానుపురి: డాక్టర్ ఏఎస్‌రావు అవార్డు కౌన్సిల్ సెకండ్ లెవల్ పరీక్ష ఫలితాల్లో సూర్యాపేటలో సిటీ టాలెంట్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఆర్.ప్రకాష్‌రెడ్డి హెచ్ఎం మురళీధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆపాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. 10వతరగతి నుంచి ఆర్.సాత్విక్ సాయి రాష్ట్ర స్థాయి 8వ ర్యాంకు, కె.హరిణి 15వ ర్యాంకు, 9వ తరగతి నుంచి బి.ప్రణవి 9వ ర్యాంకు, ఎస్.సాయిగోకుల్ 16వ ర్యాంకు, ఎస్.సాయిసృజన 19వ ర్యాంకు ,జి. శ్రీజ 20వ ర్యాంకు, ఆర్.నందకిశోర్ 22వ ర్యాంకు, వై.ప్రజ్ఞారెడ్డి 32వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు.



విజయకేతనం చూపుతున్న సిటీ టాలెంట్ స్కూల్ విద్యార్థినీవిద్యార్థులు

రైతులపై దాడిచేయడం హేయం సీపీఐ(ఎంఎల్)

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 14: తమ డిమాండ్లను ఆమోదించాలని డిల్లీలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో దాడి చేయించడం దారుణమని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. డిల్లీలో రైతులపై జరిగిన దాడిని ఖండిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని రైతు బజార్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. నాలుగేళ్ల క్రితం డిల్లీలో రైతులు ధర్నా చేయగా, వ్యవసాయ నల్లచట్టాలను వెనక్కి తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసి, నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తు కార్పొరేటు సంస్థలకు అండగా ఉందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకూ ప్రజలు బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, చంద్రకళ, రామోజీ, ఎస్‌కే గులాం, వీరబాబు పాల్గొన్నారు.



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజాపంథా నాయకులు

బంద్‌ను విజయవంతం చేయాలి

చిలుకూరు, కోదాడ రూరల్, హుజూర్‌నగర్, నడిగూడెం, పెన్‌పహాడ్, తిరుమలగిరి, ఫిబ్రవరి 14: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జె.నర్సింహారావు పిలుపునిచ్చారు. బుధవారం చిలుకూరు మండలంలోని నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. కోదాడలోని సీపీఎం కార్యాలయంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒక్కవంతుల కోటేశ్వరరావు మాట్లాడుతూ బంద్‌లో అందరూ పాల్గొనాలన్నారు. సమ్మె పోస్టర్లను హుజూర్‌నగర్‌లోని రైస్ మిల్లు డ్రైవర్ల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ ఆవిష్కరిచారు. సమ్మెలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొనాలని ఎస్‌బీఐలో సీపీఐ జిల్లా నాయకులు కంబాల శ్రీనివాసు వినతిపత్రం అందజేశారు. బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ నడిగూడెం మండల అధ్యక్షుడు మల్లెల వెంకన్న కోరారు. బంద్‌ను విజయవంతం చేయాలని జీఎం పీఎస్ జిల్లా కార్యదర్శి వీరబోయిన రవియాదవ్, సీఐటీయూ జిల్లా నాయకుడు రణపంగి కృష్ణ కోరారు. పెన్‌పహాడ్ మండలంలో వేర్వేరుగా వారు మాట్లాడారు. సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ, సీపీఎంనాయకులు ఎల్లంల యాదగిరి, కడెం లింగయ్య కోరారు. తిరుమలగిరిలో కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

గరిడేపల్లి, ఫిబ్రవరి 14: మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన మిడస నమెట్ల కృష్ణయ్య ఇటీవలో మండలంలోని ఎల్బీనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి బుధవారం జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కోశాధికారి జోగు అరవిందరెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ ఉప సర్పంచ్ గండ్ర సైదిరెడ్డి, బాల్తు వెంకటేశ్వర్లు, చందాసైదిరెడ్డి, సుందరి శ్రీనివాస్, అనంతు చంద్రయ్య, నాగిరెడ్డి, షేక్ పకీరా, రాంబాబు, పిచ్చయ్య, అశోక్, శివ, రఫీ, సైదులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే విద్యార్థులకు విజయం

నడిగూడెం, ఫిబ్రవరి 14: విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి భయాన్ని వీడితేనే విజయం సాధిస్తారని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, విజయీభవ ట్రస్టు చైర్మన్ సీహెచ్ రాజశేఖర్ అన్నారు. బుధవారం నడిగూడెం గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ఆసక్తితో చదివితే మంచి మార్కులను సాధించవచ్చన్నారు. అభిరుచి కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, హెచ్ఎం ధనవిజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, వసంత, మూర్తి పాల్గొన్నారు.



సూర్యాపేట అర్బన్: ప్రభుత్వ పథకాలు పేదలకే అందాలని సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక గౌరవ సలహాదారుడు డాక్టర్ కె. రంగారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి మాట్లాడారు. పాత రేషన్‌కార్డులను ప్రక్షాలన చేసి బోగస్ రేషన్‌కార్డులను ఏత్తివేయాలన్నారు. ఆదార్‌కార్డుకు ఆస్తులను, బ్యాంక్ అకౌంట్‌లను, పాన్‌కార్డులను అనుసందానం చేయాలన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ ఏ. వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఎల్. భద్రయ్య, ఆర్. లింగయ్య, వీరయ్య, కిరణ్, నాగరాజు, అబ్దుల్ కరీం, రవనమ్మ, వెంకట్‌యాదవ్, దాసరి రాములు, నర్సయ్య, నాగేందర్‌నాయక్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డీఎస్ఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు దగ్గుపాటి బాబూరావు అన్నారు. డీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ నాయకుడు మేళ్ళచెర్వు ముక్కంటి 56వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దగ్గుపాటి బాబూరావు, రాంబాబు, గోపి, శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలో సీఐగా బాధ్యతలు స్వీకరించిన చరమంద రాజు, ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ముత్తయ్యను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చింతకాయల రాము, పిట్టల రవి, శ్రీను, వెంకటేశ్వర్లు, శీలం శ్రీను ఉన్నారు.

నేరేడుచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా వృథాగా ఉన్న రైతు వేదికలను వినియోగంలోకి తేవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో ఆయనవిలేకరులతో మాట్లాడుతూ గామాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో గత ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికలు నిరుపయోగం ఉన్నాయన్నారు.

● నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, వైస్ చైర్‌పర్సన్ అలుక సరితను వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ చైర్మన్ కొత్తలక్ష్మణ్, నటరాజు, పుల్లయ్య, పాల్వాయి గోపాలకృష్ణ, గజ్జల కోటేశ్వరావు, రాము, పోతుగంటి సత్యనారాయణ, గుంటూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో బుధవారం లక్ష్మీనృసింహుని కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

● మట్టపల్లి మహాక్షేత్రంలో రథ సప్తమి వేడుకలను ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నరికొండ నవీన్‌లు తెలిపారు ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలతో పాటు మట్టపల్లి వీధులలో గజ, గరుడ, అశ్వ, శేష, హనుమత్, సింహ రథం వాహనాలపై స్వామివారు దర్శనమిస్తారని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మఠంపల్లి: పశు సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల పశు వైద్యాధికారి శంకర్ కట్టా అన్నారు. మండల పశు వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఎదకు రాని, చూడి కట్టని పశువులను అల్ట్రాసౌండ్ స్కానింగ్‌తో పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వీరారెడ్డి, సిబ్బంది రమాకాంత్, ఉపేందర్, పాల్ ఆరోగ్య మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

చిలుకూరు: గ్రామాల్లో నర్సరీలను కార్యదర్శులు సమర్ధత నిర్వహించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ రూపేందర్ సింగ్ సూచించారు. మండలంలోని ఆచార్యులగూడెం గ్రామంలో గ్రామ నర్సరీని పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులు, అంగన్‌వాడీ పాఠశాలలను తనిఖీ చేసి మాట్లాడారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మునగాల రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, ప్రజలకు మేలు జరిగేలా బడ్జెట్‌ను కేటాయించిందని ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు పచ్చిపాల శ్రీను అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీల అమలుకు రూ. 53.196కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు.

నూతన్‌కల్: మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన దేశ్‌ముఖ్ జెన్నారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి నుంచి భూములు కొనుగోలు చేసిన రైతులకు పట్టాలు ఇవ్వాలనిరైతు సంఘం జిల్లా నాయకుడు మూరగుండ్ల లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాల్వాయి సూరయ్య కోరారు. ఈ మేరకు ధరణి పోర్టల్ చైర్మన్ కోదండరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

● తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ధర్మభిక్షం 102వ జయంతిని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు తొట్ల ప్రభాకర్ గౌడ్ కోరారు. నూతనకల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూర్యాపేటలో నిర్వహించే ఈ వేడుకలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

తిరుమలగిరి: తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలో జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తిచేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజని కోరారు. తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న మునిసిపల్ భవనం, ఆడిటోరియం, కమ్యూనిటీహాల్, కల్వర్టు నిర్మాణాలను అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు.

మద్దిరాల: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు అన్నారు. మండలంలోని పోలుమళ్ల గ్రామ ఎస్సీ కాలనీలో ఉపాధి నిధులు రూ.10లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు.